క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు



మద్దిలపేటలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువని విజయరాంపురం త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటలో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ గురువును గుణాతీతుడు, రూపవర్జితుడుగా వర్ణించారు. సమితి ప్రతినిధులు జి.కృష్ణ సూరప్పుడు, బి.పైడన్న, కె.బంగారునాయుడు, కె.సంతోష్, లక్ష్మి, కె.రాజు, కె.బంగారుతల్లి, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో 3న వైద్య శిబిరం



కరపత్రం అందిస్తున్న నాయకులు, వలంటీర్లు

మధురవాడ: ప్రతి ఇంటిలోని సభ్యుల యోగక్షేమాలు, అనారోగ్య సమస్యలు తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో ఈ నెల 3న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, నాయకులు దాసరి భాను, వలంటీర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

నవ్వులు పూయించిన కామెడీ షో

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ హ్యూమర్ క్లబ్ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ రత్న కామెడీ, హాస్య ప్రియ, హాస్య దర్బారు క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శింది ప్రేక్షకులను నవ్వించారు. వీటిలో లాయర్ పరాంకుశం, బట్టల షాపు, పేకాట రాదన్నావు, కవితల ఆవిష్కరణ, మూడు మాత్రలు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, నాయుడు, పుష్యమి, అనూరాధ, కుమారి, పోర్టు శేషు, శ్రీధర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పూయించాయి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఉత్సాహంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు



లక్ష్మీపురంలో రోడ్లను ఊడుస్తున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు, సర్పంచ్ జగదీశ్వరరావు



మంగమారిపేట బీచ్‌లో వ్యర్థాలు సేకరిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము, తదితరులు



రేవళ్లపాలెంలో ర్యాలీలో నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, తదితరులు



కొండపేటలో స్వచ్ఛభారత్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు

కొమ్మాది: పరిసరాలు, తీరం పరిశుభ్రత బాధ్యత అందరిపైనా ఉందని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో జెడ్సీ బొడ్డేపల్లి రాము, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ శ్రీ పాద శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు గణపతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే అందరికీ ఆరోగ్యం

ఆనందపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే అందరికీ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి ఎం.ఎ.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వేములవలసలో చెత్త రహిత భారత దేశం అనే అంశంలో భాగంగా ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవలస జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్మికులను సన్మానించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తరలించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, సర్పంచ్ కొండమ్మ, మజ్జి వెంకటరావు, డబ్ల్యూఎస్ ఎస్ఈ శివనంద కుమార్, కోరాడ రాంబాబు, కోరాడ నవీన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భీమిలి అర్బన్, రూరల్ గ్రామాల ప్రజలు చేయిచేయి కలిపి వీధులు శుభ్రం చేశారు. పలుగు, పార చేతపట్టి రోడ్లపై, ఇరువైపులా అడ్డంగా ఉన్న మట్టి దిబ్బలను సరిచేశారు. చీపుర్లతో రహదారులను శుభ్రంచేసి తట్ట, బుట్టలతో చెత్తను దూరంగా పారవేశారు. తుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించారు. లక్ష్మీపురం పంచాయతీలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాడు తాతినాయుడు, కరుభుక్త అప్పలనారాయణ, కె.జోగినాయుడు, కరుభుక్త వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ రెండో వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి ఆధ్వర్యంలో శిల్లా కరుణాకరరెడ్డి తదితరులు సంతపేట, సంగివలస కొత్తమ్మ తల్లి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. 1, 2 వార్డు సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ తదితరులు బాలాజీనగర్‌లో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. ఒకటో వార్డులో డ్వాక్రా మహిళలు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న తదితరులు టాయిలెట్లు, వాటి పరిసరాలను శుభ్రం చేసి తుప్పలను తొలగించారు. భీమిలి సన్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు చిట్టివలస పెట్రోల్ బంకు, మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఫిజికల్ ఫిట్‌నెస్ సెంటర్‌కు చెందిన మాజీ సైనికుడు ఎం.ఎ.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్వచ్ఛ భారత్ మిషన్ తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పలు ప్రాంతాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భీమిలి తీరంలో అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ పవర్ సంస్థ ఆధ్వర్యంలో పార్లే ఫర్ ఇండియా, పీఎం పాలెం బేతనీ పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు పరిసరాలు శుభ్రం చేశారు. సంస్థ అధ్యక్షుడు నిమ్మకాయల భాస్కర్ మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛ భారత్ ప్రారంభించిన తర్వాత పరిసరాల పరిశుభ్రతపై చాలా మందికి అవగాహన ఏర్పడిందన్నారు. ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ద్వారా వితంతువులకు సాయం అందిస్తున్న సభ్యులు తోటవీధిలో పరిసరాలు శుభ్రం చేశారు. ప్రోగ్రాం మేనేజర్ కె.దుర్గరాజు, కో ఆర్డినేటర్లు వి.సత్యనారాయణ, అనన్యాదాస్ పాల్గొన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత ఆధ్వర్యంలో పలువురు నాయకులు వీధుల్లో చెత్త సేకరించి, శ్రమదానం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిళ్లా రమణ, వాంద్రాసి సూరప్పారావు, జీవీఎంసీ పారిశుధ్య విభాగం సెక్రటరీ బి.రమణ, ఇతర సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పరిసరాలు శుభ్రం చేశారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ క్రాప్స్ సహకారంతో మొక్కలు నాటారు.

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం శ్రమదానం చేశారు. అనంతవరం ప్రాథమిక పాఠశాల వద్ద స్టేట్ బ్యాంకు సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించారు. బ్యాంకు మేనేజర్ రవి కుమార్, అకౌంటెంట్ భవానీశంకర్, సూరిబాబు, సత్యనారాయణ, ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు రాలి అప్పారావు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, ఆర్.శ్రీనివాసరావు, హెచ్.మహేష్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.



భీమిలి బీచ్‌లో చెత్త తొలగించిన విద్యార్థులు



అంబేడ్కర్ కూడలిలో స్వచ్ఛభారత్‌లో విద్యార్థులు



వేములవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న డీపీవో శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు



సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం వద్ద స్వచ్ఛ భారత్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఉచిత శిక్షణకు సహకరిస్తున్న ఉపాధ్యాయులను ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సన్మానించింది. ఆదివారం ఉచిత శిక్షణ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణితంలో మెలకువలు బోధించిన బోని వెన్నెల, ప్రవీణలను నిర్వాహకులు, విద్యార్థులు సన్మానించారు. యాగాటి వెంకటరమణ బయాలజీ, వీటీ విజయ్‌కుమార్ సోషల్, పక్కి నాగేశ్వరరావు ఫిజిక్స్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బోధించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, అధ్యక్షుడు దత్తి ఈశ్వరరావు, కార్యదర్శి రేఖ అప్పారావు, కో ఆర్డినేటర్ భరత్, డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేడు పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు పాత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

పద్మనాభం: మండలంలోని పాత కొవ్వాడ, పెంట గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

తాటాకు ఇల్లు దగ్ధం

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో శనివారం అర్ధరాత్రి మూగి పెద్ద ఎర్రయ్య తాటాకు ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

ముందుగా ఇంటి నుంచి మంటలు వ్యాపించడంతో గుర్తించిన స్థానికులు బోరుబావుల నుంచి నీటిని మంటలపై వెదజల్లడంతో తీవ్రత తగ్గింది. ప్రమాదంలో ఇంట్లోని ఫర్నీచర్, ఇతర ఉపకరణాలు కాలిపోవడంతో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది. సర్పంచ్ మేరుగు సంతోషికుమారి, ఎల్లాజీ తదితరులు బాధితులను పరామర్శించారు.

నెల రోజులపాటు కలాం జయంత్యుత్సవాలు



ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న కృష్ణమూర్తి

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నెల రోజులపాటు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు భీమిలి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ప్రోమోను ఇటీవల గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా ఆవిష్కరించామని తెలిపారు. దేశానికి అబ్దుల్ కలాం అందించిన సేవలు అపూర్వమైనవని, ఆయన గొప్పదనం అందరికీ తెలిసేలా విగ్రహాలు ఆవిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలతోపాటు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 31న జీవీఎంసీ సెంట్రల్ పార్కు ఎదురుగా 25వేల అడుగుల జాతీయ పతాకాన్ని పది వేల మంది విద్యార్థులతో ప్రదర్శిస్తామని తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భాద్రపద మాస శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించు కుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ మ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వైద్య విద్యార్థి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఓ కారు ఢీకొట్టింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గీతం కళాశాలలో వైద్య విద్య అభ్యసిస్తున్న లోకేష్, మనోజ్‌రెడ్డి, జంపాన సుజిత్ వర్మ ఆదివారం ఉదయం కారులో భీమిలి నుంచి రుషికొండ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రామాద్రి వద్ద రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న లారీని కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు టైరు ఒకటి వేరుకాగా కారు ముందుబాగం నుజ్జునుజ్జైంది. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో ముందు కూర్చున్న మనోజ్ రెడ్డి, లోకేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెనుక కూర్చున్న జంపాన సుజిత్ వర్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా సుజిత్ వర్మను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మనోజ్ రెడ్డి అతివేగంగా కారు నడపడమే ప్రమాదానికి కారణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సుజిత్ వర్మ తండ్రి జంపాన శ్రీనివాస్‌రావు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిది రాజమండ్రి కాగా ముగ్గురూ చదువు నిమిత్తం ఎండాడలో నివసిస్తున్నారు.

యువ ఆవిష్కరణలకు టెక్ లీగ్ అద్భుత వేదిక

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- టెక్ లీగ్-2023కు 160 టీమ్‌ల హాజరు



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఎంవీపీ కాలనీ: యువ ఆవిష్కరణలకు టెక్ లీగ్ అద్భుతమైన వేదిక అని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ భాగస్వామ్యంతో టెక్ టీమ్ సొల్యూషన్స్, ఏయూ ఆ-హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్ లీగ్-2023 పోటీలకు ఎంపికైన విద్యార్థుల సమావేశం ఆదివారం ఏయూలోని వైఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు ఆవిష్కరణల దిశగా ముందడుగు వేసేందుకు కావాల్సిన అన్ని అవకాశాలు, సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికత సహకారాన్ని అందిపుచ్చుకుని ఆవిష్కరణలే లక్ష్యంగా విద్యార్థులు ఆలోచనలు చేయాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేందుకు ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. టెక్ లీగ్ వంటి పోటీల ద్వారా విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాటు ఇతరులు చేసిన ఆవిష్కరణలపైనా విజ్ఞానం పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ర్యాంకుల కోసం, మార్కుల కోసం కాకుండా ఆల్ రౌండర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కొన్ని విద్యా సంస్థలు ర్యాంకులు, మార్కులు దిశగా చేసే ప్రకటనలకు, ప్రలోభాలకు ఆకర్షితులై పిల్లలను ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతన ఆలోచనాత్మక దృక్పథం పెరిగేలా సహకారం అందించాలన్నారు. ఏయూ ఆ-హబ్ సీఈవో డాక్టర్ రవి ఈశ్వరపు మాట్లాడుతూ ఈ టెక్ లీగ్ పోటీలకు 160 టీమ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థులను పరిశోధనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలు దిశగా ప్రోత్సహించడమే టెక్‌లీగ్-2023 లక్ష్యమన్నారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు



మద్దిలో అన్నదానం ప్రారంభిస్తున్న నాయకులు

కొమ్మాది: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో వినాయక మండపం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రారంభించారు. సుమారు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

పద్మనాభం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కృష్ణాపురం, మద్ది గ్రామాల్లో ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. మద్దిలో మాజీ ఎంపీపీ కె.పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.సత్యవతి, కె.నగేష్ కుమార్ పాల్గొన్నారు.

గోతులు పూడ్చక ఇబ్బందులు



పైప్‌లైన్ పగిలిపోవడంతో ఏర్పడిన గొయ్యి



పైప్‌లైన్ రహదారిలో శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట పంప్ హౌస్ నుంచి చిట్టివలస బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం రహదారిలో తాగునీటి పైప్‌లైన్ పలుచోట్ల పగిలిపోవడంతో ఇటీవల మరమ్మతులు చేశారు. అయినప్పటికీ తరచూ పాక్షికంగా తాగునీరు వృథాగా పోతూనే ఉంది. దీంతో ఈ రహదారిలో గోతులు, దెబ్బతిన్న డ్రైనేజీలు అలాగే ఉండిపోయాయి. దీనివల్ల ఇళ్లకు మరమ్మతులు చేయించుకుందామన్నా వీలు పడడం లేదని కొండపేట వాసులు వాపోతున్నారు. గోతులు పూడ్చి డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థిని అదృశ్యం

మల్కాపురం/మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరు హనీషా అనే యువతి వన్‌టౌన్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సోదరుడు ఆమెను కాలేజీ వద్ద డ్రాప్ చేశాడు. అనంతరం యువతి ఇంటికి రాకపోవడంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి చిత్తూరు లక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళిపూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

పబ్లిక్ డిమాండ్

విద్యుత్ దీపం ఏర్పాటు చేయండి



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ఎస్సీ కాలనీలో కొంతకాలంగా విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. ఇక్కడి స్తంభానికి ఏర్పాటు చేసిన బల్బు కూడా వెలగడం లేదు. పంచాయతీ పాలకవర్గం స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– వసంత శివ, మజ్జివలస.

అధ్వానంగా దొంతల వారి కళ్లాలు రోడ్డు



గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ శివారు దొంతల వారి కళ్లాలు రోడ్డు అధ్వాన్న స్థితికి చేరుకుంది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం – బోని రోడ్డు నుంచి దొంతల వారి కళ్లాలు వరకు గతంలో మెటల్ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసి చాలా కాలం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డు మధ్యలో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వర్షాలు కురిస్తే ఆ గోతుల్లో నీరు చేరి నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకైన రహదారి... ఆపై గోతులు ఏర్పడడంతో ఇక్కట్లు పాలవుతున్నామని, అధికారులు స్పందించి రోడ్డుకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.